ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జూలై 5: జిల్లాలోని టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోని తనకార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మట్కా, గంజాయి, నకిలీవిత్తనాల విక్రయం, రాయితీ బియ్యం తరలింపు, దేశీదారు దిగుమతి, అక్రమ ఇసుక రవాణా తదితరాలను అరికట్టాలన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యక్రమాలకు పాల్పడితే తమకు నెం.8712670505కి కాల్ చేసి తెలియజేయాలన్నారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్, ఎస్సై వెంకటేష్, గంగన్న, పీసీలు మధు, రమేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల సమయాలను పునః సమీక్షించాలి



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్ టౌన్, జూలై 5: గురుకుల పాఠశాలలకు కొత్తగా ప్రకటించిన టైంటేబుల్‌కు వ్యతిరేకంగా తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలురపాఠశాల-2లో విరామ సమయంలో శుక్రవారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌యుటీఎఫ్ జిల్లా కోకన్వీనర్ నరేష్ మాట్లాడుతూ పిల్లలమానసిక ఎదుగుదలకు ఆటంకంగా ఉన్న టైంటేబుల్‌ను విరమించుకోవాలని అన్నారు. ఉదయం 7.45నుంచి మధ్యాహ్నం 1.45వరకు భోజనం చేయకుండా పిల్లలను ఉంచడం ఎలా సాధ్యమో ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అరకొర వసతులు, అద్దె భవనాల్లో ఉన్న గురుకులాల్లో మార్చిన సమయాల్లో బోధనతోపాటు ఎలాంటి క్వార్టర్స్ లేకుండా రాత్రి9గంటల వరకు ఉపాధ్యాయులు ఉండాల్సిన పరిస్థితి ఉందని దీంతో మానసికఒత్తిడికి గురవుతారని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టాలకు వ్యతిరేకంగా ఉన్న ఈపనివేళలను వెంటనే సవరించాలని, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుచరిత, ఉపాధ్యాయులు సునీత, రజీ అహ్మద్, గోపి, నయీం, శిరీన్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి), జూలై 5: ఆసిఫాబాద్ జిల్లాలోని తెలంగాణ సాంఘికసంక్షేమగురుకులాల్లో 17అతిథి అధ్యాపకులు, ఉపాధ్యాయులఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారిణి స్వరూపరాణి, డీసీవో బాలరాజు ఒకప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల9న ఆసిఫాబాద్ గురుకుల పాఠశాలలో డెమోతరగతులకు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్

- కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్సీ దండె విఠల్
- కొద్దిరోజుల క్రితమే పార్టీని వీడిన మాజీఎమ్మెల్యే కోనప్ప
- ఇక ఆసిఫాబాద్‌కు ఎమ్మెల్యే కోవ లక్ష్మి సిర్పూర్‌కు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- జిల్లాలో ప్రాభవం కోల్పోతున్న బీఆర్ఎస్



సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్

> జిల్లాలో బీఆర్ఎస్ తన పట్టును కోల్పోతోంది. మొన్న సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్ కండువా కప్పుకోగా.. నేడు ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇక మిగిలింది ఒక్క ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాత్రమే.. ఎటు చేసి అధికార పార్టీలో ఉంటే తప్ప తమకు మనుగడ ఉండదనుకుంటున్నారో లేక అధికార పార్టీ నాయకుల బెదిరింపులో లేక ప్రలోభాలకు గురిచేస్తున్నారో తెలియదు కానీ ఎటువంటి చడీ చప్పుడు లేకుండా ఎమ్మెల్సీ దండె విఠల్ కాంగ్రెస్‌లో చేరడం ఆ పార్టీని,రాజకీయ విశ్లేషకుల్ని ఆశ్చర్యానికి గురిచేసింది.

కాగజ్‌నగర్, జూలై 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయాల్లో అనూహ్య మార్పులు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలోకి వివిధ పార్టీల నుంచి చేరికలు పెరుగుతున్నాయి. ఆరునెలల క్రితం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన క్యాడర్‌తో కాంగ్రెస్‌లో పార్టీలో చేరగా తాజాగా బీఆర్ఎస్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ కూడా శుక్రవారం సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో ప్రస్తుతం జిల్లాలో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, సిర్పూరు నియోజకవర్గంలో రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాత్రమే ఉన్నారు.

పడిపోతున్న బీఆర్ఎస్ గ్రాఫ్..

బీఆర్ఎస్ పార్టీ నుంచి కీలకనాయకులు వీడి పోతుండటంతో జిల్లాలో ఆ పార్టీ ప్రాభవం కోల్పోతోంది. జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాలకు కంచుకోటగా ఉన్న బీఆర్ఎస్‌కు ఇప్పుడు బీటలు ఏర్పడుతున్నాయి.అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూరు నియోజకవర్గం నుంచి కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి కోవ లక్ష్మి బరిలో ఉండగా, ఎన్నికల ఫలితాల్లో ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఖాతాలోకి పోగా, సిర్పూరు నియోజకవర్గం బీజేపీ ఖాతాలోకి వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో పరిస్థితులన్నీ తారుమారవుతున్నాయి. బీఆర్ఎస్ ఓటమి పాలైన తర్వాత కార్యకర్తలను, క్యాడర్‌ను ఐదేళ్లపాటు వెన్నంటి ఉండి చూడటం కష్టమవుతుందన్న ఆలోచనతో నాయకులంతా అధికార పార్టీలోకి చేరుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎంపీ ఎన్నికల్లోనూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి బీఆర్ఎస్‌కు చెప్పుకోదగ్గ ఓట్లు రాలేదు. సిర్పూరు నియోజకవర్గంలో తన క్యాడర్‌తోపాటు పార్టీని కాపాడుకునేందుకు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రయత్నాలు చేస్తున్నారు. అదేవిధంగా ఆసిఫాబాద్‌లో కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమస్యలపై పోరాటం చేస్తోంది. కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి..

బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇప్పుడు త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారిస్తున్నారు. టికెట్లు ఆశిస్తున్న నాయకుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ మొదలెట్టారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇప్పటికే నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన నాయకులు టచ్‌లో ఉన్నారు. స్థానిక సంస్థల్లో బలమైన నాయకులను బరిలో దించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఒకవైపు పార్టీలో కీలకనాయకులు పార్టీ వీడుతుండగా, మరో వైపు అధికార పార్టీకి ఎదురొడ్డి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంతమేరకు సక్సెస్ అవుతారనేది వేచి చూడాల్సిందే.

మాదకద్రవ్యాల నుంచి యువతను కాపాడాలి

ఆసిఫాబాద్, జూలై 5: జిల్లాలో యువతను మాదక ద్రవ్యాలనుంచి కాపాడాలని శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ యువతను ఆసరా చేసుకుని కొంతమంది వ్యాపారస్తులు జిల్లాలో గంజాయి, డ్రగ్స్ గుట్కా, మట్కా,పేకాట, ఆన్‌లైన్‌గేమ్స్ నడిపిస్తున్నారన్నారు. వారి బారినుంచి యువతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు టికానంద్, కార్తీక్, మాలశ్రీ, నిఖిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులు ప్రజలతో మమేకమై పనిచేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 5: జిల్లాలో స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో ప్రత్యేక అధికారులుగా నియమితులైన అధికారులు ప్రజలతో మమేకమై పని చేయా లని కలెక్టర్‌వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో ప్రత్యేకాధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని అన్నిమండలాల ప్రత్యేకఅధికారులతో మండలాభివృద్ధి అధికారులు, అదనపు కలెక్టర్ దీపక్‌తివారితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు ప్రజ లకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ప్రజలకు ఊరట కలిగించేలా వ్యవహరించాలని తెలిపారు. మళ్లీ స్థానికసంస్థల ఎన్నికలు జరిగే వరకు అధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా: ఎంపీ నగేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

కాగజ్‌నగర్, జూలై 5: జిల్లాలో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉమ్మడిఆదిలాబాద్ జిల్లా ఎంపీ గోడం నగేష్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో తనను గెల్పించిన జిల్లా వాసులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు తప్పకుండా కృషి చేస్తానన్నారు. కాగజ్‌నగర్‌లోని ఎల్లాగౌడ్ తోటలో 100పడకల ఏరియా ఆసుపత్రి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో పోడురైతుల సమస్య అధికంగా ఉన్నట్టు తెలిపారు. అటవీశాఖ అధికారుల వేధింపులు అధికంగా ఉన్నట్టు తెలిపారు. రహదారుల మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించటం లేదని పేర్కొన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాలను ప్రస్తావిస్తానని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీ కృషి చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సిందం శ్రీనివాస్, దోని శ్రీశైలం, చన్కపురి గణపతి, కాలిదాస్ మండల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు..

సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు జన్మదిన వేడుకల సందర్భంగా ఎంపీ గోడెం నగేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌తోపాటు కార్యకర్తలు, అభిమానులు కేక్‌కట్ చేశారు. అనంతరం మొక్కలను నాటారు. అలాగే రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీనాయకులున్నారు.

అధిక నిధులు తీసుకువస్తా..

ఆసిఫాబాద్: కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకువచ్చి జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఎంపీగా గెలుపొంది శుక్రవారం మొదటి సారిగా జిల్లా కేంద్రానికి రావడంతో మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియో జకవర్గం తనకు 47వేలపైచిలుకు ఓట్లమెజార్టీ ఇచ్చిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కిరణ్, చక్రపాణి, తిరుపతి, ప్రణయ్, జయరాజ్, సురేష్, పెంటయ్య, గణేష్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

సాధించిన ప్రగతిని అలాగే కొనసాగించాలి: కలెక్టర్



మొక్కలు నాటుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే



కలెక్టర్ దారికి అడ్డంగా పడుకుని నిరసన తెలుపుతున్న ధర్ము

తిర్యాణి, జూలై 5: జిల్లాలో అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాల్లో సాధించిన ప్రగతిప్రస్థానాన్ని అలాగే కొనసాగించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తిర్యాణి మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో ఆయన అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్, జిల్లాపంచాయతీ అధికారి సురేందర్, వైద్యఆరోగ్య శాఖాధికారి తుకారాం భట్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ జిల్లాను మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. జీవరాశి మనుగడకు దోహదపడే మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. అనంతరం నీతిఆయోగ్ సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ అధికారి కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నీతిఆయోగ్‌లో భాగంగా వెనకబడిన ప్రాంతాల్లో ఆరోగ్యం,విద్య,వైద్యం, వ్యవసాయం, స్వయంసహాయక సంఘాల అభివృద్ధి, మహిళా శిశుసంక్షేమం సంబంధితఅంశాలపై సంపూర్ణత అభియాన్‌ద్వారా ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. ఈ క్రమంలో జిల్లాను సంపూర్ణత అభియాన్ ద్వారా ప్రథమస్థానంలోఉంచేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం..

గిరిజనుల అభివృద్ధికి అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. జిల్లాలోని తిర్యాణిమండలం పంగిడిమాధరగ్రామంలో ఆయన అదనపుకలెక్టర్ దీపక్‌తివారితో కలిసి నల్లాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఐటీడీఏ ఇస్తున్న రుణాలతోపాటు బ్యాంకులింకేజీ రుణాలుసద్వినియోగం చేసుకోవాలన్నారు.

కలెక్టర్‌కు వింత అనుభవం..

ఆసిఫాబాద్/తిర్యాణి: కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వింత అనుభవం ఎదురైంది. శుక్రవారం ఆయన తిర్యాణిలో వనమహోత్సవం కార్యక్రమం ముగించుకొని వస్తున్నక్రమంలో మండలకేంద్రానికి చెందిన పెండోర్‌ధర్ము మండలంలోని గుండాల-మంగీరోడ్డు, తిర్యాణి-శ్రీఇంక్లైయన్ వరకు రోడ్లకు మరమ్మతులు చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు. కలెక్టర్ హామీఇచ్చే వరకు దారికి అడ్డంగా పడుకుని నిరసన తెలిపాడు. ఒకదశలో కలెక్టర్ కాళ్లు పట్టుకొని ప్రాధేయపడే ప్రయత్నం చేశాడు. అధికారులు అప్రమత్తమై ఆయనను ఆపారు. దీంతో కలెక్టర్ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో కలెక్టర్ దారిచ్చాడు.

పురుగుల అన్నం పెడుతున్నారని కార్మికుల ఆందోళన

జైపూర్, జూలై 5: శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే ఓసీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మట్టి తవ్వకాల కోసం కాంట్రాక్టు దక్కించుకున్న వారాహి కంపెనీ పురుగుల అన్నం పెడుతోందని శుక్రవారం కాంట్రాక్టు కార్మికులు ఆందోళనకు దిగారు. వాహనాలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. మూడురోజులుగా నాసిరకం భోజనం పెడుతున్నారని, ఎన్నిసార్లు వారాహి అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం సరైన భోజనం పెట్టేలా చూడాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని సరైన భోజనం పెట్టేలా చూస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

నేడు జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

శ్రీరాంపూర్, జూలై 5: సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకులను వేలంవేయవద్దని డిమాండ్‌చేస్తూ తమ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టనున్నట్లు టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఒకప్రకటనలో తెలిపారు. అనంతరం జీఎంకు వినతిపత్రం అందజేస్తామ న్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె సురేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, సింగరేణి ఉద్యోగులు, ప్రజలు, మేధావులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కేంద్రంపై ఒత్తిడి తెస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

మందమర్రిటౌన్, జూలై 5: సింగరేణిలో ఉన్న నాలుగు బొగ్గుబ్లాకులను సింగరేణికే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడితెస్తుందని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరలతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యంత్రి భట్టి విక్రమార్క ప్రధానిమోదీని కలిసి వేలంపాటలు వద్దని చెప్పారని తెలిపారు. తమ యూనియన్ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీసవేతనాల మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ కూడా బొగ్గు బ్లాకుల వేలం సింగరేణికే కేటాయించేలా చూడాలని సీఎంతో మాట్లాడుతున్నారని తెలిపారు.

ఇన్‌చార్జి జీఎంతో బ్యాంకు అధికారుల సమావేశం

రెబ్బెన, జూలై 5: సింగరేణి ఇన్‌చార్జీ జీఎం నరేందర్‌తో శుక్రవారం జీఎం కార్యాలయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుసేవలు, కార్మికులకు వివిధ జీరోబ్యాలెన్స్ ఎకౌంటు, తదితర అంశాలపై ఇన్‌చార్జి జీఎంకు బ్యాంకు అధికారులు వివరించారు.



ఎలక్ట్రీషియన్‌కు మజ్దూర్ ఇవ్వడం సరికాదు

మందమర్రిటౌన్, జూలై 5: కాసిపేట2గనిలో పనిచేస్తున్న బీశ్రీకాంత్ అనే ఎలక్ట్రిషియన్‌కు సర్ఫేస్ మజ్దూర్ ఇవ్వడం సరికాదని టీబీజీకేఎస్ డిప్యూటి జనరల్ సెక్రటరీ ఓ. రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాంత్ అనారోగ్యంతో మెడికల్ బోర్డుకువెళితే పరీక్షలు నిర్వహించి అన్‌ఫిట్ చేశారని, దీంతో శ్రీకాంత్‌కు సర్ఫేస్‌మజ్దూర్ ఇచ్చారని ఇదిసరికాదని తెలిపారు. యాజమాన్యం శ్రీకాంత్‌కు ఉపరితలంలో, స్టోర్స్‌లో ఎలక్ట్రిషియన్ అవకాశం కల్పించాలని కోరారు.

క్రమశిక్షణ పేరుతో వింత పోకడలు

శ్రీరాంపూర్, జూలై 5: క్రమశిక్షణ పేరుతో సింగరేణి యాజమాన్యం చేపడుతున్న వింత పోకడలను ఖండిస్తున్నట్లు హెచ్ఎంఎస్ రాష్ట్రకార్యదర్శి రియాజ్ అహ్మద్, టీబీజీకేఎస్ ప్రధానకార్యదర్శి కె సురేందర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులపై క్రమశిక్షణచర్యలు చేపట్టినప్పుడు పసుపు,ఎరుపుకార్డులు చూపిస్తారన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ముం దుగా మూడుసార్లు పసుపు కార్డు, మళ్లీమళ్లీ అదేమాదిరిగా జరిగితే ఎరుపుకార్డు ప్రదర్శిస్తారన్నారు. దీనివల్ల వారుక్రమశిక్షణ చర్యలకు బాధ్యులవుతారన్నారు. ఇప్పటికే అధికబొగ్గుఉత్పత్తి పేరుతో ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడిఉందని, కార్డులవిధానంతో మానసికంగా మరింత ఇబ్బందులకు గురవుతారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్డులవిధానం అమలును వెనక్కితీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూలై 5: సింగరేణి సంస్థను కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. బొగ్గుగనుల వేలాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, సంస్థకు చెందిన బొగ్గు బ్లాకులను వేలంవేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కేంద్ర బొగ్గుశాఖ మంత్రిగా తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి ఉన్నప్పటికీ వేలం వేయడం దారుణమన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సింగరేణికి చెందిన నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లాకార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కేంద్రకార్యదర్శి అక్బర్ అలీ, రాష్ట్రసమితి సభ్యులు జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, కలందర్‌అలీఖాన్, యూనియన్ డిప్యూటీ కార్యదర్శి కెవీరభద్రయ్య, బ్రాంచ్‌కార్యదర్శులు ఎస్‌కె బాజీ సైదా, సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు గుల్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కస్తూరి చంద్రశేఖర్, పాల్గొన్నారు.


బొగ్గు బ్లాకులు సింగరేణికే కేటాయించాలి..

తెలంగాణలోని నాలుగు బొగ్గు బ్లాకులు సింగరేణికే కేటాయించాలని సింగరేణి ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్(140/2018) ఆధ్వర్యంలో శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఒక్క రోజు దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్ రావు, ఎ ఆనందరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.రావు, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్, బ్రాంచ్ కార్యదర్శి నక్కా సుమన్, కోశాధికారి గోదారి మురళి పాల్గొని మద్దతు తెలిపారు.

ధర్నాకు తరలి వెళ్లిన కార్మికులు..

మందమర్రిటౌన్: బొగ్గు బ్లాకుల వేలంకు వ్యతిరేకంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాకు నాయకులు, కార్మికులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. మందమర్రి గుర్తింపు సంఘం బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ కేంద్రం వెంటనే వేలం పాటలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణికే బొగ్గు బ్లాకులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గాండ్ల సంపత్,నాయకులు పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి: జీఎం



మొక్కలు నాటుతున్న జీఎం

శ్రీరాంపూర్, జూలై 5: ప్రతి ఒక్కరూ తమబాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. ఆర్కే7 ఏజెంట్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా ఒక మొక్క నాటి వాటిని సంరక్షించేందుకు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎవరికైనా బహుమతులు ఇచ్చేటప్పుడు మొక్కలు అందజేయాలని సచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటు జీఎం ఏవీరెడ్డి, అధికారులసంఘం ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్కే7 గ్రూప్‌ఏజెంట్ మాలోత్ రాముడు, గనిమేనేజర్ శ్రీధర్, ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, పిట్ కార్యదర్శి బి రవీందర్ పాల్గొన్నారు.

ఉద్యోగులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి: జీఎం

శ్రీరాంపూర్, జూలై 5: ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ తొలగించే జీవీఆర్ కంపెనీ కాంట్రాక్టు ఉద్యోగులకు శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టు ఉద్యోగుల ఆరోగ్యపరిరక్షణ సంస్థ బాధ్యత అన్నారు. ఏవైనా జబ్బులు ఉన్నట్లయితే తగినమందులు వాడుతూ విధులు నిర్వహించుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని, నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, అధికారులసంఘం శ్రీరాంపూర్ ఏరియాఅధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తోక ముడిచిన ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, జూలై 5: కోల్‌బెల్ట్ బంద్‌కు పిలుపు ఇచ్చిన ఏఐటీయూసీ తొడగొట్టి తోకముడిచిన చందంగా చేసిందని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ నీరటిరాజన్న, రాష్ట్రఉపాధ్యక్షుడు దేవిసత్యం ఒక ప్రకటనలో విమర్శించారు. సింగరేణి బొగ్గు గనుల వేలంను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం కోల్‌బెల్ట్ బంద్‌పిలుపు ఇచ్చారన్నారు. కానీదానిని విరమించుకోవడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. గతంలో కూడా ఏఐటీయూసీ ఇలాగే వ్యవహరించిందని గుర్తుచేశారు.

సెక్యూరిటీ గార్డుకు ఆర్థిక సహాయం

మందమర్రిటౌన్, జూలై 5 : మందమర్రి ఎస్అండ్‌పీసీలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న తోట తిరుపతి ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. అతని చికిత్స కోసం తోటి ఉద్యోగులు సేకరించిన రూ.1,04,500లను శుక్రవారం ఏరియా సెక్యూరిటీ అధికారి రవి తిరుపతి కుటుంబీకులకు అందజేశారు. ఆయన మాట్లా డుతూ తిరుపతిచికిత్సకు తాము అండగా ఉంటామని తెలిపారు. అధికారులు రమేష్, సుధాకర్, సంజీవ్, శంకర్, రాజయ్య, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

నారుమడికి జెండాలే రక్ష



దండేపల్లి, జూలై 5: వరి నారుమడులను కాపాడుకునేందుకు రైతులు పలు పద్ధతులు పాటిస్తున్నారు. పక్షులు, ఇతర జంతువులు నారుమడులను దెబ్బతీయకుండ పార్టీ జెండాలను ఏర్పాటు చేసి కాపాడుకుంటున్నారు. దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నారుమడి చుట్టూ బీజేపీ జెండాలతోపాటు శ్రీరామ్ జెండాను ఏర్పాటు చేశారు. రంగురంగుల చీరలతోపాటు పార్టీ జెండాలు, ఇతర బొమ్మలు కాపాడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



పర్వతాలు(ఫైల్)

చెన్నూరు, జూలై 5: చెన్నూరు పట్టణం జాతీయ రహదారి 63 పెట్రోలు బంకు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్న మృతి చెందగా తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. దుగ్నేపల్లి గ్రామానికి చెందిన సింగన వోయిన పర్వతాలు, ఓదెలు అన్నదమ్ములు. తల్లి 15 రోజుల క్రితం మరణించగా కర్మకాండలు పూర్తయ్యాయి. కోటపల్లి మండలం బబ్బెరచెలకలో ఉన్న ఓదెలు కూతురు ఇంటికి నిద్రకు వెళుతున్నారు. ఈ క్రమంలో సిరొంచ నుంచి చెన్నూరు వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టడంతో పర్వతాలు (52) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు 108 సమాచారం అందించి తీవ్ర గాయాలపాలైన ఓదెలును చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చెన్నూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండ జాగ్రత్తలు తీసుకోవాలి



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

వేమనపల్లి, జూలై 5 :సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మండలంలో జరుగుతున్నపనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో అనిల్‌కుమార్, హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, స్టాఫ్‌నర్సు శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలి

కాసిపేట, జూలై 5 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఎంఈవో ప్రభాకర్ సూచించారు. శుక్రవారం సోమగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలు పెంచేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు నిబద్ధతో పనిచేయాలన్నారు. కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. సమ యపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలుంటాయన్నారు. ప్రధానోపాధ్యాయులు లచ్చయ్య ఉపాధ్యాయు లు వాణికుమార్, కేజీబీవీ ఎస్‌వో సరిత పాల్గొన్నారు.

నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలి

మందమర్రిరూరల్, జూలై 5: వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం బొక్కలగుట్టలో ఎంపీడీవో రాజేశ్వర్ మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేసిన గుంతలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గుంతలను సిద్ధం చేయాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి విద్యాలత పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా సంజీవ్‌నగర్ వడ్డెర కాలనీ



కాలనీలో అధ్వానంగా ఉన్న దారి



వడ్డెర కాలనీలోని మురుగు కాలువ

జైనూర్, జూలై 5: మండలకేంద్రంలోని సంజీవ్‌నగర్ వడ్డెర కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఈ కాలనీలో 70 కుటుంబాలు ఉండగా 410మంది జనాభా ఉంది. 1969లో ఏర్పాటైన ఈ గ్రామంలో కాలనీ వాసులు అనేకసమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో సరైన రోడ్డు సదుపాయం లేదు. ముఖ్యంగా ఎప్పుడో నిర్మించుకున్న ఇండ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని వర్షానికి ఊరుస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సుమారు 25 మందికి పక్కాఇండ్లు లేవని పాలకప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. అదేవిధంగా ఇంతవరకు మురికి కాలువలు మంజూరు కాలేదన్నారు. తమ కాలనీపై అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారని ప్రజలు పేర్కొం టున్నారు. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్లకోసం తమను వాడుకుంటున్నారని గ్రామంలోని సమస్యల్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు. గత సంవత్సరం కాలనీనుంచి 16మంది వృద్ధులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఒక్కరికి సైతం మంజూరు కాలేదన్నారు. వారంతా ఎంపీడీవో కార్యాలయం చుట్టూ పింఛన్ కోసం తిరుగుతూ నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తమకు తాగునీటి కోసం ఒకే ఒకచేతి పంపు ఉందన్నారు. ఉదయం పూట నీటికోసం చేతిపంపు వద్ద చిన్నపాటి తగాదాలు చోటు చేసుకుంటున్నాయని అంటున్నారు. అదేవిధంగా వైద్య సిబ్బంది వారానికి ఒకసారి వచ్చిపోతారని వైద్యం అందని ద్రాక్షలా తయారైందని ఆరోపించారు. అధికారులు తమకాలనీవైపు కన్నెత్తి చూడటం లేదని పెండింగులో ఉన్న సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. రాత్రిసమయాల్లో తరచుగా విద్యుత్ అంతరాయం కలుగుతుందని కొన్ని సందర్భాల్లో రాత్రంత అంధకారంలో గడపాల్సి వస్తుందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

● **చిన్నచూపు చూస్తున్నారు**
- జిల్లపెల్లి మహేష్



మేమంతా నిరుపేదలం. రోజుపని చేస్తేనే పూట గడుస్తుంది. అధికారులకు సమస్యలపై వివరించాం. కాని వారు మా కాలనీవైపు కన్నెతి చూడటం లేదు.

● **సమస్యలన్నీ పెండింగ్‌లోనే..**
- రాపేన్ రమేష్



మా కాలనీలో అనేక సమస్యలు పెండింగులో ఉన్నాయి. మురికి కాలువ లేదు. దీంతో ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. తరచుగా అనారోగ్యానికి గురవుతున్నాం. జిల్లా ఉన్నతాధికారులకు, మంత్రి, ఎమ్మెల్యేలకు సమస్యలు వివరించాం. కానీ ఇంతవరకు వారెవరూ మా కాలనీలో అడుగు పెట్టలేదు.

బాలుడిని కాటు వేసిన పాము


చిన్నారి జాన్సన్

మందమర్రిటౌన్, జూలై 5: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన జీవన్‌కుమార్-కీర్తి దంపతుల కుమారుడు 9 నెలల జాన్సన్‌ను కట్ల పాము కాటు వేసింది. గురువారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో బాలుడు ఏడవడంతో తల్లిదండ్రులు లేచి చూడగా పాము కనిపించింది. బాలుడిని పాము కాటు వేసిందని గుర్తించారు. పామును చంపి బాలుడిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. దంపతులు నివసించే సమీపంలో చెట్లపొదలు, ఒర్రె ఉండడంతో పాములు సంచరిస్తున్నాయని స్థానికులు తెలిపారు.

భూ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

జన్నారం, జూలై 5 : అక్రమంగా తన భూమిలో సాగు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని భూమి యజమాని భుక్య బలిరాం తెలిపారు. శుక్రవారం జన్నారంలో మాట్లాడుతూ లక్ష్మీపూర్ తండాకు చెందిన తనకు నాయకపుగూడ శివారులో 16 ఎకరాల భూమి ఉందని, గత నెల 28న పత్తి చేను సాగు కోసం వెళ్లే సరికి అదే గ్రామానికి చెందిన భుక్య రమేష్, భగవాన్‌దాస్‌లు సాగు చేశారన్నారు. ఇదేమిటని అడిగితే కర్రలతో దాడి చేశారని తెలిపాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, భూమి తమకు ఇప్పించాలని బలిరాం కోరాడు. ఆయన వెంట శశికళ, దేవిదాస్, శ్రీనివాస్ ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, వైద్య సిబ్బంది

చెన్నూరు, జూలై 5: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, కమిషనర్ గంగాధర్‌లు పేర్కొన్నారు. శుక్రవారం 1, 2 వార్డుల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతుందన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కౌన్సిలర్లు సతీష్, శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ జగదీష్‌దోబా, ఏఈ సాయి, ఆశా కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య


శ్రీజ (ఫైల్)

చెన్నూరు, జూలై 5: మండలంలోని దుగ్నేపల్లి గ్రామానికి చెందిన వీరబోయిన శ్రీజ(18) శుక్రవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వీరబోయిన ఐలయ్య-లక్ష్మీల రెండో కూతురు శ్రీజ బెల్లం పల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిం ది. ఎంసెట్ ఫలితాల్లో శ్రీజ క్వాలిఫై కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీజ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నోటు బుక్కులు పంపిణీ

జైపూర్, జూలై 5: మండలంలోని దొరగారిపల్లి మండల పరిషత్ పాఠశాలలో లయన్స్ క్లబ్ సభ్యులు శుక్రవారం విద్యార్థులకు నోటు బుక్కులు, పలకలు, వాటర్ బాటిళ్లు, స్టేషనరీ వస్తువులు అందించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బాలమోహన్, ప్రోగ్రాం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సభ్యులు చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, వినయ్‌కుమార్, హన్మంతరావు, అనిల్‌కుమార్, నాగేందర్, ప్రిన్సిపాల్ సుమతి పాల్గొన్నారు.

మాతా శిశు ఆసుపత్రిలో విద్యుత్ సమస్య లేదు


సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్, ఆర్‌ఎంతో మాట్లాడుతున్న కలెక్టర్

మంచిర్యాల అర్బన్, జూలై 5: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రి (ఎంసీఎహెచ్)లో విద్యుత్ సమస్య తలెత్తిందని, దీంతో ఆసుపత్రిలోని బాలింతలు, గర్భిణులు, శిశువులు ఇబ్బందులు పడుతున్నారని వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంసీహెచ్‌లో 3వ తేదీన విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తిన విషయం వాస్తవమేనని, విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఆసుపత్రిలో రోజంతా కరెంట్ లేదని, అందరూ ఇబ్బందులు పడుతున్నారని, ఆపరేషన్లు కూడా టార్చ్ లైట్ల వెలుగులో చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో వచ్చిన వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు.

జనరేటర్ సహా యంతో విద్యుత్ అందించామని, కేవలం 3 గంటల పాటు మాత్రమే సరఫరాలో అంతరాయం కల్గిం దన్నారు. ఎంసీహెచ్ ఇన్‌చార్జి డాక్టర్ భీష్మ, ఆర్‌ఎం వో డాక్టర్ శ్రీమన్నారాయణ, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిని కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. ఆర్‌ఎంవో భీష్మతో కలిసి ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, ఫార్మసీ, పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలకు మెరుగైన సేవలందించేందుకు ఆధునిక పరికరాలు, సౌకర్యాలు కల్పించామన్నారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, పిల్లల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం భోజనం, పాలు అందించాలన్నారు. సిబ్బందిలో గైర్హాజరైన వారి వివరాలను అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, జనరేటర్ పనిచేసేలా, ఆర్‌ఓ ప్లాంట్ నిర్వహణను పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఆటో యూనియన్ వారితో కలిసి ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. వైద్యులు అలివేణి, కీర్తి పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ



మంచిర్యాల అర్బన్, జూలై 5: జిల్లా కేంద్రంలోని రెండు ప్రైవేటు ఆసుపత్రులను శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ స్టేట్ మానిటరింగ్ టీమ్ సభ్యులు శుక్రవారం తనిఖీ చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు-2010 ప్రకారంగా నిబంధనలు అమలు చేసేందుకు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం, సూపరింటెండెంట్ జయచందర్, పర్యవేక్షకులు వరప్రసాద్‌లు ఆసుపత్రులను తనిఖీ చేస్తున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అనితను కలిసి పలు అంశాలపై చర్చించారు. జాయింట్ డైరెక్టర్ రాజేశం మాట్లాడుతూ జిల్లాలో 245 ఆసుపత్రులు, 12 ఆయుష ఆసుపత్రులు నమోదు చేసుకున్నాయన్నారు. నమోదు చేసుకోని వారికి నోటీసులు ఇచ్చి జరిమానాలు విధిస్తామన్నారు. డిస్ట్రిక్ట్ సర్వేలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఫయాజ్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 5: సదరం శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవలో స్లాట్ బుక్ చేసుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఈ నెల 8, 19, 24, 31 తేదీల్లో శారీ రక దివ్యాంగులు, 11, 18 తేదీల్లో మూగ, చెవుడు, 16, 25 తేదీల్లో కంటి చూపు, 23న మానసిక దివ్యాంగులకు వైద్య పరీక్షలు జరుగుతుందన్నారు.

పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


గెలుపొందిన విద్యార్థులతో డీఈవో యాదయ్య

ఏసీసీ, జూలై 5: తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 29న జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి పోస్టర్ మేకింగ్, కవితల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు డీఈవో యాదయ్య శుక్రవారం బహుమతులు అందించారు. పట్టణంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులు అందించి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. డ్రాయింగ్‌లో ప్రథమ కె.ప్రీతికుమారి, ద్వితీయ శ్రావ్య, తృతీయ దివ్య, కవితల పోటీల్లో హసీని, సాహిత్య, సాయిస్పందనలు వరుస బహుమతులు అందుకున్నారు. జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రెటరీ కుమారస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట: జిల్లా కేంద్రంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ప్రీతికుమారి ప్రథమ బహుమతి సాధించిందని ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రమేష్ తెలిపారు. రూ.500 నగదుతో సర్టిఫికెట్ డిక్షనరీని డీఈవో అందించినట్లు తెలిపారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై పోలీసుల స్పెషల్ డ్రైవ్


ప్రజలతో మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

మంచిర్యాల అర్బన్, జూలై 5: మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆదేశాల మేరకు పోలీసులు శుక్రవారం పట్టణంలోని ఐబీ, బెల్లంపల్లి చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 53 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలు, 2 కార్లు నెంబర్ ప్లేట్లు లేకుండా పట్టుబడ్డాయని సీఐ బన్సీలాల్ తెలిపారు.

చెన్నూరు: ప్రతి వాహనానికి నంబరు ప్లేట్ ఉండాలని సీఐ రవీందర్ పేర్కొన్నారు. చెన్నూరులో వాహనాల తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు, నంబరు ప్లేట్ లేని 35 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, వాహన పత్రాలు ఉండాలని సూచించారు. నెంబరు ప్లేట్ లేకుండా వాహనం నడిపితే చర్యలుంటాయని తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

బెల్లంపల్లి(తాండూర్): శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నామని సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ఎంవీకే 3 ఇంక్లైన్‌లో సరైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలను సీజ్ చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ప్రజలు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు.

నిధుల దుర్వినియోగంపై కేసు నమోదు

జన్నారం, జూలై 5: పొనకల్ పీఏసీఎస్‌లో కొనుగోలు ఇన్‌చార్జిగా పనిచేస్తున్న గందూరి రవి బాదంపల్లి, చింతలపల్లి రైతుల ధాన్యం డబ్బులను దుర్వినియోగం చేశాడని పీఏసీఎస్ చైర్మన్ అల్లం రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజవర్ధన్ తెలిపారు. ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమచేస్తామని చెప్పి మోసం చేశాడని, రూ.12లక్షలు దుర్వినియోగంపై విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్యంపై బాలికలకు అవగాహన


మాట్లాడుతున్న వైద్యురాలు మానస

మందమర్రిరూరల్, జూలై 5: బాలికలు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మానస పేర్కొన్నారు. శుక్రవారం ఆదర్శ పాఠశాలలో బాలికల ఆరోగ్యంపై బాలిక సాధికారత ఏర్పాటు చేసిన క్లబ్ ఆధ్వర్యంలో 7, 8, 9 తరగతుల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. భోజనం చేసే ముందు, తిన్న తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. వైద్యులు రమేష్, ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి, సుష్మమాధురి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి


మృతి చెందిన చుక్కల దుప్పి

పెంచికలపేట, జూలై 5: మండలంలోని కొండపల్లి గ్రామశివారులో శుక్రవారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతిచెందింది. డీఆర్వో ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామసమీప అటవీప్రాంతంలో చుక్కల దుప్పిని కుక్కలు వెంబడించాయన్నారు. ఈఘటనలో చుక్కల దుప్పికి తీవ్రగాయాలై మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు కళేబరానికి పంచనామా నిర్వహించామని తెలిపారు.

అదుపుతప్పి బోల్తా పడిన స్కూల్ వ్యాన్

సిర్పూర్(టి), జూలై 5: మండలంలోని హుడ్కిలి గ్రామానికి చెందిన విద్యార్థులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం పాఠశాలకు చెందిన వ్యాన్ సాయంత్రం ఇంటికివెళ్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. వాహనం బోల్తాపడిన సమయంలో అందులో 20మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. ఈవిషయమై పోలీసులను సంప్రదించగా విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

గుట్కా పట్టివేత.. నిందితుడి అరెస్టు

కాగజ్‌నగర్ టౌన్, జూలై 5: కాగజ్‌నగర్‌లోని గాంధీచౌక్ ఏరియాలోని ఓ ఇంట్లో గుట్కా సంచులను శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు దాడులు చేయగా, ఇంట్లో దాచిన రూ.38వేలు విలువగల గుట్కా ప్యాకెట్లు లభించిందన్నారు. గుట్కాతో పాటు వీటిని అమ్మకానికి సిద్ధంగా ఉంచిన నిందితుడు విజయ్ తహలానిని కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

సిర్పూర్(టి)/బెజ్జూరు/దహెగాం, జూలై 5: ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పూర్(టి)ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బెజ్జూరు, దహెగాంలలో కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. సిర్పూర్(టి)లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జోగేందర్, బీజేపీ నాయకులు శంకర్, మహేష్, రంగన్న, బెజ్జూరులో తిరుపతి, వసిఖాన్, సంతోష్, నీలేష్, కిరణ్‌కుమార్, శ్యాంసుం దర్, దహెగాంలో ధనుంజయ్, తిరుపతిగౌడ్, జయలక్ష్మి, దామోదర్, ప్రదీప్ పాల్గొన్నారు.

ఏపీ సీఎంను కలిసిన గుళ్లపల్లి ఆనంద్


ఏపీ సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న గుళ్లపల్లి ఆనంద్

కాగజ్‌నగర్, జూలై 5: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌కు శుక్రవారం రాత్రి వచ్చిన సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటు కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టు అప్రజాస్వామికం


ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్‌లో అరెస్టయిన విద్యార్థి సంఘాల నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 5: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం విద్యార్థి యువజన సంఘాల నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని విద్యార్థిసంఘాల నాయకులు పేర్కొన్నారు. తొందరపాటు చర్యలకుపోతే ప్రజల్లో విశ్వసనీయతను కోల్పో తారన్నారు. ప్రజాపాలన మాటున అరెస్టులుచేస్తున్న కాంగ్రెస్‌ప్రభుత్వ తీరును ఖండించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు తిరుపతి, చిరంజీవి, ప్రణయ్, ప్రశాంత్, అయ్యూబ్‌ఖాన్, నాగరాజు, ప్రణయ్ తదిరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా?

వాంకిడి/పెంచికలపేట: నిరుద్యోగుల సమస్యలను ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టు చేస్తారా అని బీజేవైఎం నాయ కులు అన్నారు. నిరుద్యోగుల సమస్యలపై శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా ఉదయం పోలీసులు వాంకిడి, పెంచికలపేట మండలాల్లో బీజేపీ, బీజే వైఎం నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలపై ధర్నాలు చేస్తే అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వాంకిడిలో నాయకులు మహేష్, గణేష్, అక్షయ్, బాలరాజు, పెంచికలపేటలో నాయకులు సంతోష్, కాంతా రావు, మధుకర్, రాజన్న, ప్రభాకర్,వెంకన్న, ప్రభాకర్, రాజేష్, శోభన్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా

ఆసిఫాబాద్ రూరల్, జూలై 5: బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అవిడపు ప్రణయ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతో తాను పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడికి అందజేయనున్నట్లు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కెరమెరి, జూలై 5: మండలంలోని కేలి(కె)వాగులో గురువారం గల్లంతయిన జాదవ్ ప్రకాష్(38)మృతదేహం శుక్రవారం కైరివాగులో లభ్యమైంది. ప్రకాష్‌ది జైనూరు మండలం సాంబాజీగూడ గ్రామం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

సిర్పూర్(యు), జూలై 5: ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో కుడ్మేత సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో సిర్పూర్(యు), లింగాపూర్ రెండుమండలాల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. అదే విధంగా మధ్యాహ్నభోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అమ్మఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను పూర్తిచేయలన్నారు. ఈ సందర్భంగా రెండుమండలాల నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోత్నురి ఆంధ్రయ్య, ఆత్రం ఆనంద్‌రావు, విలాస్, వసంత్ రావు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన

కెరమెరి, జూలై 5, మండలంలోని గోయగాం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, చింతకర్ర ఎంపీపీఎస్ పాఠశాలలో జరుగుతున్న అమ్మఆదర్శ పాఠశాల పనులను శుక్రవారం ఎంపీడీవో అంజద్‌పాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై 20రోజులు అయినప్పటికీ పనులు పూర్తి చేయలేదన్నారు. వీలైనంత త్వరగాపనులు పూర్తిచేయాలని ఆదేశించారు. పనులకు సంబంధించి వివరాలతో కూడిన నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు.

వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలి

జైనూర్, జూలై 5: మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న వాటర్‌ప్లాంట్లను సీజ్ చేయాలని ఆదివాసీసంఘాల రాష్ట్రఅధ్యక్షుడు కనక యాదవ్‌రావ్ శుక్రవారం మండల తహసీల్దార్ బీర్షావ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మడావి మనోహర్, మేస్రాం షేకు, గణపత్, కేంద్రే సుబోద్ పాల్గొన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ

జైనూర్, జూలై 5: ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో శుక్రవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా పీడీ సురేందర్ మాట్లాడుతూ మండలంలోని పలుచోట్ల పోస్టాఫీసు వాళ్లు కూలీల వద్ద 20 నుంచి 50రూపాయలు తీసుకోవడం వంటి సమాచారం బయటపడిందన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వాంకిడి, జూలై 5: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో ఉమర్‌హుస్సేన్ అన్నారు. శుక్ర వారం మండల కేంద్రంలోని పలువార్డుల్లో పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో దోమల వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయనవెంట ఎంపీవో ఖాజా, అజీజుద్దీన్, బిల్ కలెక్టర్ గోవింద్, ఏఎన్ఎం రుక్మిణి,తదితరులున్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి పక్షోత్సవాలు

దహెగాం, జూలై 5: బీజేపీ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి పక్షోత్సవాల్లో బాగంగా శుక్రవారం మండల కేంద్రంలో అమ్మపేరుతో బీజేపీనాయకులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో బీజేపీనాయకులు ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

పాలకేంద్రాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీపీ

సిర్పూర్(టి), జూలై 5: మండలకేంద్రంలోని పేట్‌మేలలో శుక్రవారం మాజీఎంపీపీ రైయిస్ అహ్మద్ పాలకేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీలర్ ఖుర్షిద్ హుస్సేన్, అజీబ్ అహ్మద్, ఫీల్డ్ ఆఫీసర్ చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కెరమెరి, జూలై 5: మండల ప్రత్యేకాధికారిగా శుక్రవారం ఆర్ లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ డిప్యూటీసీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను మండల ప్రత్యేకాధికారిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానని అన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

పెంచికలపేట, జూలై 5: మండలంలోని మొట్ల గూడ నుంచి పెద్దవాగు వరకు బీటీరోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించాలని శుక్రవారం గుంట్లపేట గ్రామస్థులు కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. 2023లోఅప్పటి ప్రభుత్వం రూ.1.5కోట్లు మంజూరు చేసిందన్నారు. కానీ కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్నాడని అన్నారు. వర్షాలకు రోడ్డు బురదమయంగా మారడంతో గ్రామస్థులు, విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారని, సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు మహేష్,రమేష్,చలం, చిన్నయ్య, అజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణం పూర్తిచేయాలి

చింతలమానేపల్లి, జూలై 5: మండలంలోని బాబాసాగర్ జడ్పీఉన్నతపాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఎమ్మార్వో కార్యాలయంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అంద జేశారు. భవన నిర్మాణ పనులు పూర్తికాక విద్యార్థులు వర్షపునీటిలోనే చదువులు కొనసాగిస్తున్నారని అన్నారు. నిధులు విడుదలైనప్పటికీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే పాఠశాల గదుల నిర్మాణం పూర్తి కావడం లేదన్నారు. వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నితీష్, లచ్చన్న, సాయికుమార్, రమాకాంత్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

పెంచికలపేట, జూలై 5: మండలకేంద్రంలో అటవీ, రెవెన్యూ భూములను కబ్జా చేస్తున్నా వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు అటవీ శాఖ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో సుధాకర్, ఆర్‌ఐ గోపాల్‌కు వినతిపత్రం అందజే శారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, బండన్న, సంజీవ్, చంద్రమౌళి, లచ్చన్న, సాజిత్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

డీఈ తీరును నిరసిస్తూ అటెండర్ల నిరసన


డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అటెండర్లు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 5: జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయ డీఈ రవికాంత్ వేధింపులకు గురిచేస్తున్నారని నిరసిస్తూ శుక్రవారం కార్యాలయం గేటుకు తాళంవేసి కార్యాలయంలో పనిచేస్తున్న అటెండర్లు రెండు గంటలపాటు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అటెండర్ దేవిదాస్ మాట్లాడుతూ తన భార్య లహరికి తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నాయని వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లేందుకు ఫోన్‌లో సంభాషించానని ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగింద న్నారు. అయితే తనవల్ల ఏదైనాతప్పులు ఉంటే శాఖపరంగా చర్యలు తీసుకోవాలని కానీ అలా చేయలేదన్నారు. ఈ నెల 4న తనపై పోలీసులకు డీఈ రవికాంత్ ఫిర్యాదు చేశారని, దీంతో పోలీసులు తనను చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. తాను ఏదైనా తప్పు చేస్తే శాఖాపరంగా చర్యలు తీసుకోవాలి కానీ పోలీసులు పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. పోలీసుల చిత్రహింసలతో తాను మృతి చెందితే తమ కుటుంబం పరిస్థితి ఏమిటన్నారు. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తనకు న్యాయంచేయాలని ఆయన కోరారు. అనంతరం పోలీసులు పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేశారని దేవిదాస్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పలువురు కార్యాలయ అటెండర్లు పాల్గొన్నారు.



బల్దియా ఆదాయానికి 'టెండర్'

నిబంధనలకు విరుద్ధంగా చికెన్ వ్యర్థాల సేకరణ

- కోట్లు గడిస్తున్న ప్రైవేట్ వ్యక్తులు
- టెండర్ల ఊసే ఎత్తని మున్సిపాలిటీ
- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారులు
- బల్దియా ఆదాయానికి గండి

మంచిర్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో నిబంధనలు పాటిస్తూ బల్దియా ఆదాయం పెంచేందుకు కృషి చేయాల్సిన అధికారులు, పాలకవర్గ సభ్యులు తప్పుడు మార్గాలు అవలంబిస్తున్నారు. అధికారుల వైఖరి కారణంగా బల్దియా ఆదాయానికి గండి పడుతుండగా, ప్రైవేటు వ్యక్తులు కోట్లు గడిస్తున్నారు. రూ.లక్ష దాటిన ప్రతీ పనికి ఓపెన్ టెండర్లు ఆహ్వానించి పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉండగా, మంచిర్యాల మున్సిపాలిటీలో దశాబ్దాలుగా ఏకపక్ష నిర్ణయాలతో పనులు అప్పగించడం ఆనవాయితీగా వస్తోంది.

చికెన్ వ్యర్థాలకు టెండర్లు జరిగేనా...?

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను సేకరించేందుకు విధిగా టెండర్లు ఆహ్వానించవలసి ఉంది. అయితే మంచిర్యాల మున్సిపాలిటీ చరిత్రలోనే చికెన్ వ్యర్థాలకు టెండర్లు పిలిచిన దాఖలాలు లేవు. టెండర్లు నిర్వహించకుండానే తమ అనుయాయులకు కాంట్రాక్టు బాధ్యతలు అప్పగిస్తున్నారు. దశాబ్దాల కాలంగా ఇదే తంతు కొనసాగుతుండటంతో టెండర్ల రూపంలో మున్సిపాలిటీ పెద్ద మొత్తంలో ఆదాయం కోల్పోతుండగా, ప్రైవేటు వ్యక్తుల జేబులు నిండుతున్నాయి. అందుకు ప్రతిఫలంగా అధికారులు, పాలక వర్గం, ప్రజాప్రతినిధులకు కాంట్రాక్టరు నగదు బహు మతులు అందజేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆన్‌లైన్ టెండర్లు నిర్వహిస్తే ఎక్కువ కోట్ చేసిన ఏజెన్సీకి పనులు అప్పగించడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం దక్కేది. ఇదిలా ఉండగా పొరుగున ఉన్న రామగుండం కార్పొరేషన్‌లో చికెన్ వ్యర్థాల సేకరణకు ఇటీవల వేలం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపాలిటీలోనూ ఇటీవల వేలం నిర్వహించగా రూ.30 లక్షలకు కాంట్రాక్టర్ పని దక్కించుకోగా, మున్సిపాలిటీకి ఆ మొత్తం ఆదాయం సమకూరినట్లయింది. వివిధ మున్సిపాలిటీల్లో వేలం ద్వారానే చికెన్ వ్యర్థాలను అప్పగిస్తుండగా మంచిర్యాలలోనే ఏకపక్ష నిర్ణయాలతో వ్యవహరించడం గమనార్హం.

కాంట్రాక్టు కోసం రూ. 10 లక్షలు ఆఫర్...?

మంచిర్యాల మున్సిపాలిటీలో ఓపెన్ టెండర్లు లేకపోవడంతో అనధికారికంగా కాంట్రాక్టు దక్కించుకొనేందుకు పలువురు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. కరీంనగర్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ తనకు పనులు అప్పగిస్తే ఏకంగా రూ.10 లక్షలు ఆఫర్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కొన్నేళ్లుగా అనధికార కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి ఒకరు ఈ ఏడాది కూడా పనులు దక్కేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. చికెన్ వ్యర్థాలు తరలించే పని దక్కించుకొనేందుకు ఇతర కాంట్రాక్టర్లు కూడా పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 120 చికెన్ షాపులు ఉన్నట్లు అంచనా. వాటి నుంచి రోజుకు వందల క్వింటాళ్ల చికెన్ వ్యర్థాలు వెలువడుతుంటాయి. వాటిని సేకరించే కాంట్రాక్టర్ చేపల పెంపకం దారులకు విక్రయిస్తారు. మున్సిపాలిటీకి పైసా ఖర్చులేకుండా సంవత్సరానికి లక్షల ఆదాయం సమకూర్చే చికెన్ వ్యర్థాల పనులు ఈ ఏడాదైనా నిబంధనల మేరకు టెండర్లు నిర్వహించి అప్పగిస్తారో లేదో వేచి చూడాలి.

టెండర్లు ఆహ్వానిస్తాం: మారుతిప్రసాద్, మున్సిపల్ కమిషనర్



చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్ల విషయమై దృష్టి సారించలేదు. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించాల్సి ఉంది. ఈ విషయమై చైర్మన్‌తో సంప్రదింపులు జరిపి నిబంధనల మేరకు టెండర్లు ఆహ్వానిస్తాం.

జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు..

జిల్లా వ్యాప్తంగా ఏడు మున్సిపాలిటీల్లోనూ చికెన్ వ్యర్థాల టెండర్లు ఆహ్వానించడం లేదు. ప్రధాన పట్టణాలైన మంచిర్యాలతోపాటు బెల్లంపల్లి, చెన్నూరు, లక్సెట్టిపేట, మందమర్రిలలోనూ టెండర్లు ఆహ్వానించకపోవడం గమనార్హం. అన్ని చోట్లా ఏకపక్ష నిర్ణయాలతోనే పనులు అప్పగిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలతోపాటు గ్రామా ల్లోనూ ప్రస్తుతం చికెన్ సెంటర్లు వెలుస్తున్నాయి. టెండర్లు ఆహ్వానించక పోవడంతో ఆయా మున్సిపాలిటీలు, మండలాలు పెద్ద మొత్తంలో ఆదాయం కోల్పోతున్నాయి. చికెన్ వ్యర్థాలకు ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి సర్క్యులర్ జారీ అయినప్పటికీ ఆ దిశగా పాలకవర్గాలు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చికెన్ వ్యర్థాల సేకరణకు ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

ఆషాఢ వైభోగం..

నేటి నుంచి ప్రారంభం...



నస్పూర్/దండేపల్లి, జూలై 5: ఆషాఢ మాసం ఆధ్యాత్మికంగా ఎన్నో విశేషాలను కలిగి ఉంది. శనివారం నుంచి మాసం ప్రారంభమవుతోంది. ఈ మాసంలోనే గురు పౌర్ణమి, వ్యాస పూర్ణిమలు, పూరీ జగన్నాథ రథయాత్ర కన్నుల పండువగా జరుగుతుంది. తొలి ఏకాదశి, బోనాల ఉత్సవాలు ఈ మాసంలోనే జరుపుకుంటాం. పల్లె, పట్టణం తేడా లేకుండా వైభవంగా బోనాల జాతరను ప్రజలు జరుపుకుంటారు.

జిల్లాలో ప్రధానంగా మంచిర్యాల క్వారీ మహంకాళి జాతర, బొక్కల గుట్ట మైసమ్మ బోనాల జాతర (రామకృష్ణాపూర్), దుర్గాదేవి బోనాల జాతర (నస్పూర్) జరుగుతాయి. అన్ని ప్రాంతాల్లో పోచమ్మ, మహంకాళి బోనాలు నిర్వహిస్తారు. మంచిర్యాల పట్టణంలోని రెడ్డి కాలనీ, హమాలివాడ చెరువు గట్టుపై ఉన్న కట్ట పోచమ్మల బోనాల జాతర, రాముని చెరువు వద్ద పోచమ్మ బోనాల జాతర, హాజీపూర్ మండలం ర్యాలీ సమీపంలోని సర్వాయి లొద్ది దుర్గాదేవి జాతర జరుగుతుంది. బోనం ఎత్తుకొని మహిళలు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో ఆలయాలకు చేరుకుని బోనాల జాతర నిర్వహిస్తారు.

ఊరు కట్టడి...

గ్రామీణ ప్రాంతాల్లో పాడి పంటలు, పిల్లలు, పెద్దలు, పశు సంపద సల్లంగా ఉండాలని గ్రామస్థులంతా ఏకమై ఊరు కట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఊరు కట్టడి ప్రారంభమై పూజలు పూర్తయ్యే వరకు ఊరి నుంచి ఏవరూ బయటకు వెళ్లడం కానీ ఇతరులు రావడం కానీ జరగదు. గ్రామ దేవతలైనా పోచమ్మ, భూలక్ష్మీ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మేకను బలి ఇస్తారు.

గోరింటాకు ప్రత్యేకం



కొత్తగా పెళ్లైన యువతులు ఆషాఢమాసం ప్రారంభం కాగానే పుట్టింటికి వస్తారు. ఈ మాసంలో మహిళలు చేతికి గోరింటాకు పెట్టు కుంటారు. వర్షాలు కురిసి ఈ మాసంలో కొత్త నీరు వస్తుంది. కొత్త నీటితో వచ్చే వ్యాధులు సోకకుండా పాదాలు, చేతులకు మహిళలు గోరింటాకు పెట్టుకోవడంలో శాస్త్రీయత కోణం ఉంది.

రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

కోటపల్లి, జూలై 5: రొయ్యలపల్లి గ్రామంలో వర్షాభావ పరిస్థితుల్లో కలుపు నివారణ, ఎరువుల వాడకంపై ఏవో మహేందర్ శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితుల్లో ద్రవ రూప యూరియా లేదా ద్రవరూప ఎరువులను పిచికారీ చేయాలని, భూమిలో సరైన తేమ ఉన్నప్పుడే కలుపు మందులను వేయాలని సూచించారు. వారానికి ఒకసారి గొర్రైతో 60-70 రోజుల వరకు దఫాలుగా అంతర కృషి చేసినట్లయితే కలుపు నివారణతో పైరు పెరుగుదుల ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో అనూష, రైతులు పాల్గొన్నారు.

జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపండి

మంచిర్యాల అర్బన్, జూలై 5: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మంచిర్యాల పరిధిలో సీనియర్ ట్యూబర్క్యులోసిస్ ల్యాబోరేటరీ సూపర్‌వైజర్ (ఎస్‌టీఎల్ఎస్) కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పోస్టు భర్తీకి ప్రొవిజినల్ జాబితాను విడుదల చేశామని డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8వ తేదీలోగా కార్యాలయంలో తెలుపాలని పేర్కొన్నారు.

స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, జూలై 5: కాసిపేటలోని కేజీబీవీ పాఠశాలలో స్కావెంజర్ పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండి, 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 10వ తేదీలోగా మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జన్నారం, జూలై 5: నేతకానీల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత పేర్కొన్నారు. శుక్రవారం జన్నారంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నేతకాని జనాభా 20 లక్షల పైచిలుకు ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతకానీలకు ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, నామినేటెడ్ పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు గంగాధర్, లక్ష్మణ్, వెంకట్, మల్లేష్, వినోద్, శివాజీ, లింగన్న పాల్గొన్నారు.

పీఎస్సార్‌కు మంత్రి పదవి రావాలని పూజలు

హాజీపూర్, జూలై 5: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు మంత్రి పదవి రావాలని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాపల్లిలోని లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టారు. జడ్పీటీసీ పుస్కూరి శిల్ప శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు జితేందర్‌రావు, సతీష్‌రావు, సత్తయ్య, అర్జున్, బాపు, రవి, కుటుంబరావు, శంకరయ్య, రామయ్య పాల్గొన్నారు.

విదేశీ విద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 5: ఈ విద్యా సంవత్సరానికిగాను రాష్ట్ర మైనార్టీస్ సంక్షేమ శాఖ ద్వారా విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే అర్హత గల మైనార్టీ అభ్యర్థుల నుంచి ముఖ్యమంత్రి విదేశీ విద్య పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2024 నుంచి జూలై 31, 2024 కాలంలో అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో telanganaepass.cgg.gov.inలో ఈ నెల 8 నుంచి ఆగస్టు 7లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గురుకులాల పనివేళలు మార్చాలి

ఏసీసీ, జూలై 5: గురుకుల విద్యాసంస్థల పనివేళలు మార్చాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు పిల్లలు భోజనం చేయకుండా ఉండడం ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. పండగ సెలవుల్లో పనిచేయాల్సి రావడంతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారన్నారు. విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా ఉన్న పనివేళలను సవరించాలని డిమాండ్ చేశారు.

బదిలీల్లో మినహాయింపు ఇవ్వాలి

ఏసీసీ, జూలై 5: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సాధారణ బదిలీల్లో టీఎన్‌జీవో యూనిట్ల ఆఫీస్ బేరర్లకు మినహాయింపు ఇవ్వాలని నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్ అధ్యక్షతన జిల్లాలోని అన్ని యూనిట్ల టీఎన్‌జీవో అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న బదిలీలపై చర్చించారు. మంచిర్యాల యూనిట్ కార్యదర్శి అజయ్ ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్, సంజీవ్, వెంకటేష్ , చంద్రమౌళి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో మొక్కలు నాటి సంరక్షించాలి



జైపూర్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీ, ఎమ్మెల్యే, జోడువాగుల వద్ద రహదారిని పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

జైపూర్, జూలై 5: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిలు పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. విద్యార్థులు ఇష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే విశాఖ చారిటబుల్ ట్రస్టు ద్వారా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పేరిట కోట్ల రూపాయలను పాలకులు దోచుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చెన్నూరు నియోజకవర్గంలో నీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తానన్నారు. వంశీకృష్ణను ప్రభుత్వ అధికారులు, బికేపీ మహిళా సంఘాల సభ్యులు సన్మానించారు. జిల్లా అటవీ శాఖ డివిజనల్ అధికారి వినయ్‌కుమార్ సాహూ, డీఆర్‌డీవో కిషన్, అడిషనల్ డీఆర్‌డీవో దత్తరావు, ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్ , లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన

భీమారం: మండలాన్ని అభివృద్ధి చేస్తామని ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిలు పేర్కొన్నారు. నర్సింగాపూర్‌లో రూ.1.60 కోట్లతో నిర్మించనున్న 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు కలెక్టర్ కుమార్ దీపక్, మండల స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య, ఎంపీడీవో రాథోడ్ రాధతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3.20 కోట్లు ఖర్చువుతుందని, నెల రోజుల్లో టెండరు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. నర్సింగాపూర్‌లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. జోడు వాగుల ప్రాంతంలో రోడ్డును పరిశీలించారు. రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో రూ.1.80 కోట్లతో 20 కిలోమీటర్ల మేర ప్యాచ్ వర్క్ చేపట్టామని, అటవీ శాఖ క్లియరెన్స్ లేక రోడ్డు నిర్మాణం ఆగిపోయిందని, త్వరలోనే జోడు వాగుల ప్రాంతంలో ఫోర్‌లేన్ ఏర్పాటు చేస్తామన్నారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పూర్తిస్థాయిలో లేదని ఎమ్మెల్యేకు తెలుపగా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఏసీపీ నరేందర్, శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్ఐ రాములు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పోడేటి రవి, మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, రమేష్, మల్లేష్, తిరుపతి, తిరుమలలక్ష్మణ్, రాజ్‌కుమార్‌నాయక్, పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారానికి కృషి చేయాలి

చెన్నూరు, జూలై 5: ఆస్నాద గ్రామంలోని భూ సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి రైతులు కోరారు. శుక్రవారం ఆస్నాద గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. మూడు దశాబ్దాల క్రితం నుంచే రెవెన్యూ రికార్డుల ప్రకారం పట్టాలు ఉన్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని వారు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, చెన్నూరు ఎఫ్‌డీవో రమేష్, ఎఫ్ఆర్‌వో శివలతో సమావేశం ఏర్పాటు చేసి భూ సమస్య అంశంపై చర్చించారు. శనివారం రైతులతో మాట్లాడి భూములను, రికార్డులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో శానిటేషన్, క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు.

పాత బస్టాండ్‌కు చెందిన రాము అనే చిరు వ్యాపారి, కాంగ్రెస్ అభిమాని గుండెపోటుతో మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాము ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు.

నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని బీజేవైఎం ఆందోళన



కలెక్టరేట్ ముట్టడికి తరలివస్తున్న బీజేవైఎం కార్యకర్తలు, మంచిర్యాలలో పోలీసుల అదుపులో నాయకులు

నస్పూర్, జూలై 5: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం బీజేవైఎం కార్యకర్తల కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా కార్యకర్తలు, నాయకులు ఒక్కసారిగా కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్నారు. లోపలకు వెళ్లడానికి కార్యకర్తలు, నాయకులు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తయిందని, ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, మెగా డీఎస్సీ వేయాలన్నారు. జీవో నంబరు 46ను రద్దు చేసి కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 12న సీఎం క్యాంపు క్యారాలయాన్ని ముట్టడిస్తామన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి, నాయకులు రాగిడి రవి, సత్యనారాయణ, కొండ వెంకటేశ్, రవనవేని శ్రీనివాస్, సుమన్, వెంకటేశ్, పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టు

బెల్లంపల్లి: హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముట్టడికి వెళ్లకుండా విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులను ఖండిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సబ్బని రాజేంద్రప్రసాద్, దీపక్‌కుమార్, వెంకటేష్, శ్రావణ్ ఉన్నారు. తాండూర్ మండలంలో టీజీపీఎస్సీ ముట్టడికి వెళ్తున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణదేవరా యలు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్, మండల అధ్యక్షుడు మామిడి విగ్నేష్, బాలకృష్ణ, సతీష్, నరేష్‌లను అరెస్టు చేశారు.

హాజీపూర్: టీజీపీఎస్సీ ముట్టడికి హైదరాబాద్ వెళ్తున్న బీజేవైఎం నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, గ్రూప్ 2, 3 పోస్టుల సంఖ్యలను పెంచాలని డిమాండ్ చేశారు.

చెన్నూరు: హైద్రాబాద్‌లో నిర్వహించే నిరుద్యోగుల ధర్నాకు వెళ్తున్న బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయబ్, రవీందర్, ప్రశాంత్ ఉన్నారు.

దండేపల్లి: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పిట్టల తిరుపతి అన్నారు. నెల్కివెంకటాపూర్‌లో అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

మంచిర్యాల అర్బన్: హైదరాబాద్‌లో నిరుద్యోగ ధర్నా నేపథ్యంలో పట్టణ పోలీసులు విద్యార్థి సంఘాల, బీజేవైఎం నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వెంకటేశ్వర్‌రావు, తులా ఆంజనేయులు, ప్రవీణ్, రాజేష్, రాజ్‌కుమార్, వంశీ, రాకేష్, మల్లేష్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కలెక్టరేట్‌కు వస్తున్న సీఐటీయూ, సీపీఎం నాయకులు

నస్పూర్, జూలై 5: ప్రభుత్వ రంగ సంస్థలు, ఖనిజ సంపదను అన్నింటిని కార్పొరేట్, పెట్టుబడిదారులకు అమ్మివేయలన్నా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏవోకు అందజేశారు. బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. బొగ్గు బావుల ప్రైవేటీకరణను నిరసిస్తూ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, సీఐటీయు జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్, నాయకులు ప్రకాష్, నగేష్, మధు, ఉమారాణి, సమ్మక్క, రామస్వామి, చంద్రశేఖర్, బాలాజీ, శ్రీనివాస్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: కేంద్రం ప్రభుత్వం బొగ్గుబ్లాకులను వేలం వేయడాన్ని నిరసిస్తూ సంజీవయ్య కాలనీలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరి నల్ల జెండాలను ఎగురవేసి నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ కేంద్రం బొగ్గుబ్లాకుల వేలంను రద్దు చేయాలని, సింగరేణికే బ్లాకులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఖరారు



వార్షిక రుణ ప్రణాళిక బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 5: జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం 6వేల 66కోట్ల రూపాయలుగా నిర్ధేశించామని, బ్యాంకర్లు తమ లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 31,2024 నాటికి 4వేల540 కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేశామన్నారు. నిర్ధేశించిన లక్ష్యాలను అధికారులు పూర్తి చేయాలని సూచించారు. డీఆర్‌డీవో శేషాద్రి, ఆర్‌బీఐ ఏజీఎం సాయితేజరెడ్డి, నాబార్డు డీడీఎం వీరభద్రుడు, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు



స్ట్రాంగ్‌రూం వద్ద కలెక్టర్

హాజీపూర్, జూలై 5: ఈవీఎంల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకొంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాలులోని స్ట్రాంగ్‌రూంల వద్ద బందోబస్తు ఏర్పాట్లను ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూంలలో బ్యాలెట్ యూనిట్‌లు, కంట్రోల్ యూనిట్‌లు, వీవీ ప్యాట్లను పటిష్టమైన నిఘా ఏర్పాట్ల మధ్య భద్రపర్చి సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు.